


# కడప మనసాక్షి
PRGI Reg.No: APTEL/26/A0309
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily





వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్: వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి: 01 సంచిక: 242 | శనివారం, 05 సెప్టెంబర్ 2026 | పేజీలు: 4 | వెల.రూ.2/-


## సెప్టెంబర్ 10, 11న కలెక్టర్ల సదస్సు



అమరావతి, సెప్టెంబర్ 5: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 10, 11 తేదీల్లో అమరావతి సచివాలయంలో రెండు రోజుల పాటు కలెక్టర్ల సదస్సు జరగనుంది. గత కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు పురోగతిపై తొలిరోజు సమీక్ష నిర్వహించనున్నారు. స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాలు, రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లాల వారీ అభివృద్ధి ప్రణాళికలపై కలెక్టర్లతో చర్చించనున్నారు. సూపర్ సిక్స్ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, పెట్టుబడులు, వ్యాపార నిర్వహణ సౌలభ్యం, జలధార కార్యక్రమం పురోగతిపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. కలెక్టర్లు అమలు చేస్తున్న ఉత్తమ వినూత్న కార్యక్రమాలపై ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయనున్నారు. రెండో రోజు డిజిటల్ పాలన, ఆర్టీజీఎస్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థల పనితీరు, క్షేత్రస్థాయి సమస్యలపై ఓపెన్ ఫోరంలో చర్చించనున్నారు. శాంతిభద్రతల పరిస్థితిపైనా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు.

## పుష్కరాల నాటికి గోదావరి కాలుష్యరహితంగా: పవన్ కళ్యాణ్



అమరావతి, సెప్టెంబర్ 5: రాబోయే గోదావరి పుష్కరాల నాటికి నదిని సంపూర్ణంగా కాలుష్యరహితంగా తీర్చిదిద్దాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రాజమహేంద్రవరం నుంచి అంతర్వేది వరకు గోదావరిలో కలుస్తున్న ప్రధాన, ఉప డ్రెయిన్లపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో సుమారు 15 ప్రధాన, 45 వరకు చిన్న డ్రెయిన్లు నదిలో కలుస్తున్నాయని, వీటి ద్వారా చేరుతున్న మురుగు, పారిశ్రామిక వ్యర్థాలపై శాస్త్రీయ విశ్లేషణ చేపట్టాలని తెలిపారు. పరిమితికి మించి కాలుష్యం ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గోదావరి తీరంలోని 262 గ్రామ పంచాయతీల్లో శుద్ధి చేయని మురుగు నదిలో కలవకుండా చర్యలు తీసుకోవాలని, వాటిని 'మోడల్ పుష్కర పంచాయతీలు'గా తీర్చిదిద్దాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

## మచిలీపట్నం--తిరుచెందూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

మచిలీపట్నం, సెప్టెంబర్ 5: పండుగల సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మచిలీపట్నం నుంచి తమిళనాడులోని తిరుచెందూర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు నంబర్ 07440 మచిలీపట్నం--తిరుచెందూర్ ప్రత్యేక రైలు సెప్టెంబర్ 11, 12, 18, 19 తేదీల్లో అందుబాటులో ఉండగా, రైలు నంబర్ 07439 తిరుచెందూర్--మచిలీపట్నం ప్రత్యేక రైలు సెప్టెంబర్ 12, 13, 19, 20 తేదీల్లో నడవనుంది. ఈ రైళ్లకు గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట తదితర ప్రధాన స్టేషన్లలో నిలుపుదల కల్పించారు. ఈ ప్రత్యేక రైళ్లలో ఒక ప్రథమ శ్రేణి వాతానుకూల బోగీ, రెండు ద్వితీయ శ్రేణి వాతానుకూల బోగీలు, రెండు తృతీయ శ్రేణి వాతానుకూల బోగీలు, తొమ్మిది



స్లీపర్, నాలుగు సాధారణ ద్వితీయ శ్రేణి బోగీలు ఉంటాయి. ప్రయాణికుల రద్దీని బట్టి ఈ ప్రత్యేక రైళ్ల సేవలను మరింత కాలం పొడిగించే అవకాశముందని సమాచారం.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

అమరావతి, సెప్టెంబర్ 5: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, నగర సర్వీసులు, అంతర్‌జిల్లా బస్సుల్లో ఈ సదుపాయం వర్తిస్తుంది. తీవ్ర వైకల్యంతో ఒంటరిగా ప్రయాణించలేని దివ్యాంగులతో పాటు వెళ్లే సహాయకులకు 50 శాతం రాయితీ లభిస్తుంది. సదరం ధ్రువీకరణ పత్రం లేదా యూడీఐడీ కార్డులో కనీసం 40 శాతం వైకల్యం నమోదై ఉండాలి. ఉచిత ప్రయాణానికి 'దివ్యాంగ శక్తి స్మార్ట్ బస్ పాస్' లేదా చెల్లుబాటు అయ్యే యూడీఐడీ కార్డు అవసరం. స్మార్ట్ బస్ పాస్‌లోా= కోడ్, ఆర్ఎఫ్ఐడీ చిప్ ఉండడంతో టికెట్ యంత్రం ద్వారా వివరాలను పరిశీలించి ఉచిత ప్రయాణ టికెట్ జారీ




చేస్తారు. గ్రామ, వార్డు సచివాలయాలు, సమీప ఆర్టీసీ డిపో కౌంటర్లలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సదరం ధ్రువీకరణ పత్రం లేదా యూడీఐడీ కార్డు, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలు సమర్పించాల్సి ఉంటుంది.

## గోదావరి కాలుష్యంపై ఆంధ్రా పేపర్‌కు సమన్లు జారీ చేయండి: పవన్ కళ్యాణ్



అమరావతి, సెప్టెంబర్ 5: రాజమహేంద్రవరం గోదావరి నది కాలుష్యానికి ఆంధ్రా పేపర్ లిమిటెడ్ ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోపించారు. నగరంలో రోజుకు ఉత్పత్తి అవుతున్న సుమారు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాల్లో ఆంధ్రా పేపర్ నుంచే దాదాపు 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు విడుదలవుతున్నాయని తెలిపారు. సంస్థ విడుదల చేస్తున్న వ్యర్థాల్లో కాలుష్య కారకాలు అనుమతించిన పరిమితుల కంటే అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. 2016 నుంచి స్థానిక సంస్థలకు పన్నులు చెల్లించకుండా రూ.21.34 కోట్ల వరకు బకాయిలు పెట్టిందని ఆరోపించారు. తప్పులను సరిదిద్దుకునేందుకు అవకాశం ఇచ్చినా సంస్థ నుంచి సరైన స్పందన రాలేదని పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సంస్థకు సమన్లు జారీ చేసి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. గోదావరి పర్యావరణ వ్యవస్థను పరిరక్షించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మున్సిపల్ వార్డుల పునర్విభజనకు షెడ్యూల్



అమరావతి, సెప్టెంబర్ 5: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనకు పురపాలక శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు వార్డుల పునర్విభజన ప్రతిపాదనలపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 12న తుది ప్రతిపాదనలను పురపాలక శాఖ డైరెక్టరేట్‌కు సమర్పించాలి. సెప్టెంబర్ 13న తుది వార్డుల విభజనను ప్రకటించి, సెప్టెంబర్ 14న ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో అధికారికంగా ప్రకటించనున్నారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని వార్డుల పునర్విభజన చేపట్టనున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ ప్రక్రియ కొనసాగనుంది.

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి: పేర్ని నాని



అమరావతి, సెప్టెంబర్ 5: డీఎస్సీ--2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. అర్హత లేని అభ్యర్థులకు స్పోర్ట్స్ కోటా పేరుతో టీచర్ ఉద్యోగాలు కట్టబెట్టారని విమర్శించారు. డీఎస్సీ--2025లో ఎంపికైన అభ్యర్థుల టెట్ మార్కులు, కేటగిరీ, సబ్జెక్టు అర్హత, కేటాయించిన పోస్టులను కంప్యూటర్ ఆధారంగా పునఃపరిశీలించేందుకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర సంస్థ సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 15 ప్రకారం టీచర్ ఉద్యోగానికి టెట్ అర్హత తప్పనిసరి అని, ఏ కోటాలో ఎంపికైనా ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపారు. కర్నూలు జిల్లా కౌతాలం మండలంలోని ఓ పాఠశాలలో టెట్‌లో కనీస అర్హత మార్కులు సాధించని అభ్యర్థికి ఎస్జీటీ ఉద్యోగం ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కౌతాలం మండలంలో 24 మంది స్పోర్ట్స్ కోటా టీచర్ల నియామకంపై కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని పేర్ని నాని డిమాండ్ చేశారు.

## కోటి ఇళ్లకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం'




అమరావతి, సెప్టెంబర్ 5: తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం--2026' కార్యక్రమం 40 రోజుల్లో కోటికి పైగా కుటుంబాలను చేరుకోవడం గొప్ప మైలురాయని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఎండ, వానను లెక్కచేయకుండా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై అభిప్రాయాలను సేకరించి డిజిటల్‌గా నమోదు చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోని సుమారు 1.35 కోట్ల కుటుంబాల్లో 73.6 శాతం కుటుంబాలను 40 రోజుల్లోనే పార్టీ శ్రేణులు కలిశాయని, ఒకే రోజు 19,405 పోలింగ్ కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించడం, 28,397 మంది కార్యకర్తలు పాల్గొనడం వంటి రికార్డులు

# రవితేజ మేనల్లుడు మాధవ్ 'మారెమ్మ'.. ఆసక్తి పెంచుతున్న ట్రైలర్!



హైదరాబాద్, సెప్టెంబరు 1: మాస్ హీరో రవితేజ సోదరుడు రఘు కుమారుడు మాధవ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'మారెమ్మ'. మంచర్ల నాగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో దీపా బాలు కథానాయికగా నటించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను రామ్ పోతినేని విడుదల చేశారు. పల్లెటూరు, అక్కడి నమ్మకాలు, భయం చుట్టూ కథ సాగుతున్నట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. గ్రామంలో వరుసగా గేదెలు చనిపోవడంతో ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. దీనికి ఏదో శక్తి కారణమని గ్రామస్థులు నమ్ముతారు. మూడో పౌర్ణమిలోపు ఒక మగ దున్నపోతు పుడుతుందని, అదే గ్రామాన్ని కాపాడుతుందని పెద్దలు చెప్పడంతో కథలో ఆసక్తికరమైన మలుపు మొదలవుతుంది. ఆ దున్నపోతుకు 'మారి' అని పేరు పెట్టి మాధవ్ తన దగ్గర పెంచుకుంటాడు. దాంతో అతనికి దానితో ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడుతుంది. మరోవైపు గ్రామ జాతర సమీపిస్తుండటంతో మారిని సొంతం చేసుకోవాలని కొందరు ప్రయత్నించడం, దాన్ని చంపేందుకు ప్రయత్నాలు చేయడం కథలో ఉత్కంఠను పెంచుతున్నాయి. మొదటి చిత్రంతోనే మాధవ్ విభిన్నమైన కథను ఎంచుకున్నట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. గ్రామీణ యువకుడి పాత్రలో అతని నటన సహజంగా కనిపిస్తోంది. మాధవ్, మారి మధ్య ఉన్న అనుబంధం భావోద్వేగానికి ప్రధాన బలంగా నిలిచేలా కనిపిస్తోంది. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే దృశ్యాలు, రాత్రి సన్నివేశాలు, జాతర నేపథ్యంలో వచ్చే ఘట్టాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంత్ ఆర్. విహారి నేపథ్య సంగీతం అందించారు. 'మారెమ్మ' సెప్టెంబరు 10న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది

# ఉత్తరాదిపై నాని ఫోకస్.. 'ది ప్యారడైజ్' కోసం భారీ ప్రచార వ్యూహం!



హైదరాబాద్, సెప్టెంబరు 1: నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో నాని ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో సినిమాకు భారీగా ప్రచారం కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అమెరికాలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో కలిసి నిర్వహించిన సంగీత కార్యక్రమాల ద్వారా విదేశాల్లో సినిమాపై మంచి ఆసక్తి ఏర్పడింది. ఇక మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్ వంటి ఉత్తరాది ప్రాంతాల్లో నేరుగా ప్రచారం నిర్వహించేందుకు నాని సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక మార్కెట్ సంపాదించుకున్న నాని.. 'ది ప్యారడైజ్'తో హిందీ మార్కెట్‌లోనూ సొంత గుర్తింపు తెచ్చుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉత్తరాది ప్రేక్షకులకు నచ్చేలా సినిమాలోని మాస్ అంశాలను ప్రచారంలో ప్రధానంగా చూపించేందుకు చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 'దసరా' తర్వాత శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. మోహన్‌బాబు, రాఘవ్ జుయెల్ ప్రతినాయకులుగా నటిస్తుండగా.. కయదు లోహర్ కథానాయికగా కనిపించనున్నారు. సంపూర్ణేష్ బాబు కూడా కీలకమైన పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. విడుదల సమయం దగ్గరపడటంతో మిగిలిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయాలని చిత్రబృందం భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాకు విడుదలకు ముందు రోజు రాత్రే ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. నాని ప్రచార వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో, 'ది ప్యారడైజ్' ఉత్తరాదిలో ఎలాంటి వసూళ్లు సాధిస్తుందో చూడాలి.

# కూర్మావతార్ టీజర్ విడుదల.. శివరాజ్‌కుమార్ పాత్రపై పెరిగిన ఆసక్తి!

హైదరాబాద్, సెప్టెంబరు 1: శివరాజ్‌కుమార్, వరలక్ష్మి శరత్‌కుమార్, రాజ్‌తరుణ్, శివాజీ, సాయికుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్న 'కూర్మావతార్' చిత్ర టీజర్ విడుదలైంది. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పురాణ అంశాలను నేటి సమాజంలోని పరిస్థితులతో ముడిపెట్టి రూపొందించినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. భూమిపై చెడు పెరిగిపోయినప్పుడు మహావిష్ణువు ఏదో ఒక రూపంలో రంగంలోకి దిగుతాడనే కథాంశంతో సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. విష్ణువు దశావతారాల్లోని కూర్మావతారం ఈ చిత్రంలో కీలక అంశంగా కనిపిస్తోంది. తాబేలు ఆకారాన్ని పలు సన్నివేశాల్లో ప్రత్యక్షంగా చూపించడంతో పాటు, కథలో ఒక సంకేతంగా కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. శివరాజ్‌కుమార్ పాత్రను టీజర్‌లో ప్రధానంగా యాక్షన్ కోణంలో చూపించారు. చేతిలో త్రిశూలం, గంభీరమైన రూపంతో ఆయన కనిపించే సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి. ఆయన పాత్ర వెనుక ఏదో రహస్యం దాగి ఉన్నట్లు టీజర్ ఆసక్తిని పెంచుతోంది. రాజ్‌తరుణ్ పాత్రలోనూ యాక్షన్ సన్నివేశాలు కనిపించగా, సాయికుమార్ స్వరం టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాలో రాక్షసులను కేవలం




పురాణాల్లో కనిపించే రూపాలుగా కాకుండా స్వార్థం, దుర్బుద్ధి, అధికార దాహంతో ఉన్న మనుషుల మరో రూపంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. పురాణ కథనాన్ని ప్రస్తుత సామాజిక సమస్యలతో ముడిపెట్టిన విధానం ఆసక్తిని రేకెత్తిస్తోంది. చీకటి నేపథ్యాలు, భారీ నిర్మాణాలు, యుద్ధ సన్నివేశాలతో టీజర్ సాగింది. అజనీష్ లోక్‌నాథ్ నేపథ్య సంగీతం సినిమాకు మరింత ఉత్కంఠను తీసుకొచ్చింది. భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్ర విడుదల తేదీని చిత్రబృందం ఇంకా ప్రకటించలేదు. దేశవ్యాప్తంగా విడుదల చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# 'పంజా' రీ రిలీజ్.. దర్శకుడికి మళ్లీ దారి చూపిస్తుందా?



హైదరాబాద్, సెప్టెంబరు 1: పవన్ కల్యాణ్ కథానాయకుడిగా విష్ణువర్ధన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పంజా' చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. 2011లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, పవన్ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. పవన్ కల్యాణ్ గడ్డం లుక్, జై పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, యువన్ శంకర్ రాజా సంగీతం ఇప్పటికీ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సెప్టెంబరు 2న నాలుగు కే నాణ్యతతో 'పంజా' మళ్లీ థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ముందస్తు టికెట్ బుకింగ్‌లకు మంచి స్పందన వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దర్శకుడు విష్ణువర్ధన్ పేరు మరోసారి తెలుగు చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. విష్ణువర్ధన్ గతంలో అజిత్‌తో 'బిల్లా', 'ఆరంభం' వంటి చిత్రాలను తెరకెక్కించడంతో పాటు హిందీలో 'షేర్షా'తోనూ గుర్తింపు తెచ్చుకున్నారు. హీరోలను విభిన్నమైన శైలిలో చూపించడంలో ఆయనకు ప్రత్యేకత ఉంది. అయితే 'పంజా' తర్వాత ఆయన తెలుగులో మరో భారీ చిత్రం చేయలేదు. ఇప్పుడు 'పంజా' రీ రిలీజ్ కారణంగా విష్ణువర్ధన్ పేరు మళ్లీ తెలుగు చిత్ర పరిశ్రమలో వినిపిస్తోంది. పవన్ కల్యాణ్‌తో సినిమా చేసిన అనుభవం, తన దర్శకత్వ శైలిపై ఆయన తాజాగా మాట్లాడే అవకాశం రావడం కూడా దర్శకుడికి ఉపయోగపడే అంశంగా మారింది. రీ రిలీజ్ విజయం నేరుగా కొత్త అవకాశం తెచ్చిపెట్టకపోయినా, పెద్ద హీరోలు, నిర్మాతల దృష్టిని మరోసారి ఆయన వైపు మళ్లించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# 'రేస్ 4'లో అమీర్ ఖాన్.. నిర్మాత క్లారిటీ ఇదే!



ముంబై, సెప్టెంబరు 1: బాలీవుడ్‌లో ప్రముఖ యాక్షన్ చిత్రాల పరంపరగా కొనసాగుతున్న 'రేస్' నాలుగో భాగంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో అమీర్ ఖాన్ కథానాయకుడిగా నటించనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై నిర్మాత రమేష్ తౌరానీ స్పష్టత ఇచ్చారు. 'రేస్ 4' నటీనటుల ఎంపిక ఇంకా పూర్తికాలేదని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఊహాగానాలను నమ్మవద్దని ఆయన తెలిపారు. నటీనటుల ఎంపిక పూర్తయిన తర్వాత నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటిస్తుందని వెల్లడించారు. అమీర్ ఖాన్‌తో పాటు సిద్ధార్థ్ మల్హోత్రా, టైగర్ ష్రాఫ్ పేర్లు కూడా ఈ చిత్రానికి సంబంధించి ప్రచారంలో ఉన్నాయి. అయితే వీరిలో ఎవరినీ చిత్రబృందం అధికారికంగా ఖరారు చేయలేదు. గతంలో అక్షయ్ ఖన్నా తిరిగి 'రేస్ 4'లో కనిపించనున్నారనే వార్తలు కూడా వచ్చాయి. వాటిని సైతం రమేష్ తౌరానీ ఖండించారు. 2008లో ప్రారంభమైన 'రేస్' చిత్ర పరంపరలో ఇప్పటివరకు మూడు భాగాలు విడుదలయ్యాయి. నాలుగో భాగాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో, ఇందులో ఎవరు నటిస్తారనే అంశంపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ప్రచారాలను నమ్మవద్దని నిర్మాత సూచించడంతో అమీర్ ఖాన్ ప్రవేశంపై ప్రస్తుతం తెరపడినట్లయింది.

# 'కల్కి 2' షూటింగ్‌పై నాగ్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు.. ప్రభాస్ డేట్స్‌పై ఆసక్తి!



హైదరాబాద్, సెప్టెంబరు 1: ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కల్కి 2' చిత్రంపై ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. ఈ సినిమా షూటింగ్ ఇప్పటివరకు కేవలం పది రోజులు మాత్రమే జరిగినట్లు నాగ్ అశ్విన్ వెల్లడించారు. తదుపరి షూటింగ్ షెడ్యూల్ ఎప్పుడు ప్రారంభమవుతుందో తనకే స్పష్టత లేదని ఆయన చెప్పినట్లు సమాచారం. కొన్ని నెలల క్రితం ఆగస్టు లేదా సెప్టెంబరు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని నాగ్ అశ్విన్ తెలిపారు. అయితే ప్రస్తుతం పరిస్థితి మారినట్లు తెలుస్తోంది. ప్రభాస్ ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలోని 'ఫౌజీ', సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' చిత్రాలతో బిజీగా ఉండటంతో 'కల్కి 2' కోసం వరుసగా పెద్ద షెడ్యూల్ కేటాయించడం కష్టంగా మారినట్లు సమాచారం. ఇప్పటికే 'కల్కి 2898 ఏడీ' కోసం రూపొందించిన కొన్ని సెట్లు, వాహనాలు, పాత్రల రూపకల్పనలు సిద్ధంగా ఉండటంతో రెండో భాగం షూటింగ్ ప్రారంభమైన తర్వాత వేగంగా పూర్తి చేయవచ్చని చిత్రబృందం భావిస్తోంది. అయితే కీలక నటీనటుల తేదీలు సమన్వయం చేయడం ప్రధాన సవాలుగా మారింది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ పాత్రలు కూడా రెండో భాగంలో కీలకంగా ఉండనున్నాయి. మరోవైపు మొదటి భాగంలో సుమతి పాత్రలో నటించిన దీపికా పదుకొణె రెండో భాగంలో కొనసాగడం లేదు. అయితే సుమతి పాత్ర కథలో కొనసాగుతుందని నాగ్ అశ్విన్ ఇప్పటికే వెల్లడించడంతో ఆ పాత్రకు మరో కథానాయికను ఎంపిక చేయాల్సి ఉంది. మొదటి భాగం ముగింపులో భైరవ, అశ్వత్థామ, యాస్కిన్ కథలను కీలక దశలో నిలిపివేశారు. దీంతో రెండో భాగంలో ఈ పాత్రల కథలు ఎలా ముందుకు సాగుతాయనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ప్రస్తుతం 'కల్కి 2' కోసం ప్రభాస్ ఎప్పుడు పూర్తిస్థాయిలో తేదీలు కేటాయిస్తారన్నదే కీలకంగా మారింది.

# రష్మిక 'మైసా' విడుదల తేదీ ఖరారు.. నవంబర్ 27న థియేటర్లలోకి!

హైదరాబాద్, సెప్టెంబరు 1: నటి రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మైసా' చిత్ర విడుదల తేదీ ఖరారైంది. నవంబర్ 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీని ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో రష్మిక చేతిలో ఈటె పట్టుకుని రక్తపు మరకలతో కూడిన గంభీరమైన రూపంలో కనిపించారు. ఇప్పటివరకు విడుదలైన చిత్రానికి సంబంధించిన దృశ్యాలు కూడా యాక్షన్ ప్రధానంగా సాగాయి. 'మైసా' చిత్రీకరణ ఇంకా పూర్తికాలేదు. చిత్రీకరణ సమయంలో రష్మికకు తుంటి భాగంలో గాయం కావడంతో కొంతకాలం విశ్రాంతి తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో తిరిగి చిత్రీకరణలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. ఆమె తిరిగి వచ్చిన తర్వాత మిగిలిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. విడుదలకు కేవలం మూడు నెలల సమయం మాత్రమే ఉండటంతో చిత్రబృందం పనులను వేగవంతం చేయాల్సి ఉంది. ఈ సినిమాలో రష్మిక గోండు తెగకు




చెందిన యువతిగా కనిపించనున్నారు. పాత్ర కోసం ఆమె బ్యాంకాక్‌లో యాక్షన్ శిక్షణ తీసుకున్నారు. కేరళలో జరిగిన చిత్రీకరణలో పలు సాహస సన్నివేశాల్లోనూ పాల్గొన్నారు. నీటిలో చిత్రీకరించిన క్లిష్టమైన సన్నివేశాన్ని ఇప్పటికే పూర్తి చేసినట్లు సమాచారం. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఈశ్వరీరావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో నవంబర్ 27న ఈ చిత్రం విడుదల కానుంది.

# 'ది ప్యారడైజ్' పాట షూటింగ్‌పై వివాదం.. సంచలన ఆరోపణలు చేసిన సుమలత



హైదరాబాద్, సెప్టెంబరు 1: నాని కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంలోని ఓ పాట చిత్రీకరణ డ్యాన్సర్ల సంఘంలో వివాదానికి దారితీసింది. పాట కోసం సుమారు 300 మంది డ్యాన్సర్లు అవసరం కాగా, తమ సంఘం నుంచి 100 మంది సభ్యులను మాత్రమే పంపి మిగిలిన 200 మందిని సంఘ గుర్తింపు కార్డులు లేని వారితో భర్తీ చేశారని సంఘం అధ్యక్షురాలు, నృత్య దర్శకురాలు సుమలత ఆరోపించారు. సంఘ నిబంధనలను పక్కనపెట్టి ఇతర ప్రాంతాల నుంచి డ్యాన్సర్లను తీసుకురావడం వల్ల స్థానిక సభ్యుల ఉపాధికి నష్టం జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. సంఘ గుర్తింపు లేని వారికి నిర్మాతలు చెల్లించే పారితోషికం సక్రమంగా అందుతుందో లేదో కూడా స్పష్టత లేదని సుమలత ఆరోపించారు. ఈ వ్యవహారంలో సంఘ బాధ్యులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆమె విమర్శించారు. మరోవైపు డ్యాన్సర్ల సంఘంలో అంతర్గత విభేదాలు కూడా ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేశాయి. జానీ మాస్టర్‌పై నిబంధనల ఉల్లంఘన ఆరోపణల నేపథ్యంలో చలనచిత్ర పరిశ్రమకు చెందిన 24 విభాగాల సమాఖ్య సహాయ నిరాకరణ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో 'ది ప్యారడైజ్' పాట చిత్రీకరణ నుంచి జానీ మాస్టర్ తప్పుకోవాల్సి వచ్చిందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. తమపై తీసుకున్న నిర్ణయాన్ని సుమలత ప్రశ్నించారు. అక్రమాలను ప్రశ్నించినందుకే తమ సంఘంపై ఏకపక్షంగా చర్యలు తీసుకున్నారా అని నిలదీశారు. సమస్య పరిష్కారం కోసం మెగాస్టార్ చిరంజీవిని సంప్రదించామని, ఆయన స్పందించి తమను పిలిచి మాట్లాడారని తెలిపారు. తప్పు చేసిన వారితో పాటు, తప్పును ప్రోత్సహించిన వారిపైనా చర్యలు ఉండాలని చిరంజీవి చెప్పినట్లు సుమలత వెల్లడించారు.

కడప మనస్సాక్షి
తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



# ఒక్క చుక్క రక్తం.. ఒక నిండు ప్రాణం!



కడప, సెప్టెంబర్ 4: రక్తదానం మానవత్వానికి ప్రతీక అని ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ అన్నారు. కడప నగరంలోని పీఆర్ఆర్ఎం ఫార్మసీ కళాశాలలో ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రక్తదాతలను అభినందించారు. పలుమార్లు రక్తదానం చేస్తూ అత్యవసర సమయాల్లో సేవలందిస్తున్న కడప సమాచార పౌర సంబంధాల శాఖ ఫొటోగ్రాఫర్ పిఎండి సోహైల్ అలీ ఖాన్‌ను శ్రీకాంత్ ఘనంగా సన్మానించి జ్ఞాపిక, శాలువా అందజేశారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమని, ఒక వ్యక్తి చేసే రక్తదానం మరో వ్యక్తి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి అపోహలకు తావులేకుండా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గౌరవ అధ్యక్షుడిగా పాల్గొన్న సినీ నిర్మాత కె. రామకృష్ణ మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో రక్తదాతలు, సామాజిక సేవకులు, ట్రస్ట్ ప్రతినిధులు, వైద్య, విద్యా రంగాల ప్రముఖులు, సినీ అభిమానులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. ప్రమాదాలను నివారించండి




కడప, సెప్టెంబర్ 4: రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 364 కేసులు నమోదు చేసి రూ. 74,960 జరిమానా విధించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం, అధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించి తమతో పాటు ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించవద్దని హెచ్చరించారు.

# దేగనవాండ్లపల్లెలో కార్డన్ అండ్ సెర్చ్



సిద్దవటం, సెప్టెంబర్ 4: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిద్దవటం ఎస్ఐ హారిక, పోలీసు సిబ్బంది శుక్రవారం దేగనవాండ్లపల్లె గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో పోలీసులు నేరుగా మాట్లాడి మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక శక్తుల కదలికలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, వినాయక చవితి వేడుకల నేపథ్యంలో ప్రజలు సంయమనం పాటించి ఎలాంటి వివాదాలు, ఘర్షణలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు, పండుగలను నిర్వహించుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్, విజిబుల్ పోలీసింగ్, ప్రజా అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# వడ్డిరాలలో సైబర్ మోసాలపై అవగాహన



జమ్మలమడుగు, సెప్టెంబర్ 4: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు రూరల్ సీఐ కుళ్లాయప్ప, తలమంచిపట్నం ఎస్ఐ హైమావతి ఆధ్వర్యంలో వడ్డిరాల గ్రామంలో శుక్రవారం ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలను జాగ్రత్తగా నడపాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రలోభాలకు, వివాదాలకు లోనుకాకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేస్తామని సీఐ కుళ్లాయప్ప తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



కడప, సెప్టెంబర్ 4: రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రధాన రహదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి లారీలు, బస్సులు, కార్లు, వ్యాన్ల డ్రైవర్లను ఆపి "ఆపండి.. ముఖం కడుక్కోండి.. విశ్రాంతి తీసుకుని వెళ్లండి" కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. నిద్రమత్తు, అలసటతో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని, అలసటగా అనిపిస్తే వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో నిలిపి విశ్రాంతి తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం ప్రాణాంతకమని, డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని కోరారు.

# గొల్లపల్లిలో ఘనంగా శ్రీకృష్ణ కల్యాణోత్సవం





నందలూరు, సెప్టెంబర్ 4: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని నందలూరు మండలం గొల్లపల్లిలో రామాలయం వద్ద నిర్వహించిన శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్‌రాయుడు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన బత్యాల చంగల్‌రాయుడికి మేళతాళాలు, బాణసంచా నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆయనను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత గొబ్బిళ్ల సుబ్బరాయుడు, ఐటీడీపీ పునగాని రాము, కూటమి పార్టీల నేతలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ కల్యాణోత్సవంలో యల్లటూరు శ్రీనివాసరాజు



రాజంపేట, సెప్టెంబర్ 4: రాజంపేట రూరల్ మండలం మదన గోపాలపురంలోని మదన గోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని 12వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొండూరు విశ్వనాథరాజు, కుర్ర వెంకటసుబ్బయ్య, కిషోర్ యాదవ్, సూర్య, హరీష్‌తో పాటు జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, వినోద్ వర్మ, పత్తి నారాయణ, కోలాటం హరి, శివశంకర్ రాజు, సాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ప్రజా చేరువ'

రాయచోటి, సెప్టెంబర్ 5: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా రాయచోటి నియోజకవర్గంలో శనివారం 'ప్రజా చేరువ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో పూజల అనంతరం 11 గంటల నుంచి ఎస్ఎన్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల స్వీకరణ, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర అతిథి గృహంలో రోడ్లు, భవనాలు, విద్యుత్, రవాణా శాఖల అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష చేపడతారు. సాయంత్రం 4.15 గంటలకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి అనంతరం మీడియా సమావేశం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు, మీడియా ప్రతినిధులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# నవదంపతులకు యల్లటూరు శ్రీనివాసరాజు శుభాకాంక్షలు

రాజంపేట, సెప్టెంబర్ 5: రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు రాజంపేట భువనగిరిపల్లికి చెందిన పూల హరిప్రసాద్, పూల స్వర్ణలతల కుమారుడు యశ్వంత్‌రాయ్, సుజని నవదంపతులను వారి నివాసానికి వెళ్లి అభినందించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐకమత్యంతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు మాజీ సర్పంచ్ లక్ష్మి నరసయ్య, పెదకాల సుధాకర్‌రాయల్, సుదర్శన్‌రాజు, పీవీఆర్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొని నవదంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజుకు నవదంపతుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# హస్తవరంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



రాజంపేట, సెప్టెంబర్ 5: రాజంపేట మండలం హస్తవరం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఉట్టి ఉత్సవంలో పిల్లలు, యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకుడు శివ శ్రీకృష్ణాష్టమి విశిష్టతను భక్తులకు వివరించారు. వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# గోశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




వీరపునాయునిపల్లి, (మనస్సాక్షి): సంగాలపల్లి గ్రామంలోని శివకృష్ణ గో సంరక్షణశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోశాల అధ్యక్షుడు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ధర్మం నశించి అధర్మం పెరిగినప్పుడు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, లోకకల్యాణం కోసం భగవంతుడు అవతరిస్తాడని అన్నారు. శ్రీకృష్ణుడు విష్ణువు దశావతారాల్లో ఎనిమిదో అవతారమని, శ్రీకృష్ణావతారంలో అనేక దుష్ట శక్తులను సంహరించి ధర్మాన్ని కాపాడారని వివరించారు. గోవర్ధనగిరిని ఎత్తి గోవులను, గోపాలకులను రక్షించడం, పాండవులను కాపాడటం వంటి అనేక సందర్భాల్లో శిష్ట రక్షణ చేశారని తెలిపారు. మానవ సమాజానికి భగవద్గీత శ్రీకృష్ణుడు అందించిన గొప్ప కానుక అని, శరీరం నశించినా ఆత్మకు మరణం లేదని, ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలనే సందేశాన్ని గీత ద్వారా అందించారని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడికి గోవులకు ఉన్న పవిత్ర అనుబంధాన్ని వివరించిన తులసిరెడ్డి, సంగాలపల్లి శివకృష్ణ గోశాలలో శ్రీకృష్ణ జయంతిని వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్తలు నరసింహారెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, దేవిరెడ్డి రఘునాథ్‌రెడ్డి, తోట లవకుశరెడ్డి, కత్తి చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు, రఘునాథరెడ్డి, సరోజమ్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వేంపల్లిలో డ్రోన్ బీట్ నిర్వహణ



వేంపల్లి, (మనస్సాక్షి): అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వేంపల్లి సీఐ నరసింహులు ఆధ్వర్యంలో శుక్రవారం డ్రోన్ బీట్ నిర్వహించారు. ఫ్రెండ్స్ కేఫ్, ఎన్‌టీఆర్ సర్కిల్, రాజీవ్‌నగర్ కాలనీ, అలవలపాడు రోడ్డు, హనుమాన్ జంక్షన్, కడప రోడ్డు, గాజులపేట గ్రామంలోని పార్కు ప్రాంతం, గండి రోడ్డు, అలిరెడ్డిపల్లి రోడ్డు పరిసరాల్లో డ్రోన్ ద్వారా విస్తృతంగా నిఘా చేపట్టారు. జూదం, బహిరంగంగా మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి అరికట్టడమే డ్రోన్ బీట్ లక్ష్యమని పోలీసులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు హెచ్చరించారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు నిర్వహించాలి



వేంపల్లి, (మనస్సాక్షి): వినాయక చవితి ఉత్సవాలను భక్తి, శాంతి, సమైక్యతతో నిర్వహించాలని వేంపల్లి సీఐ టీ. నరసింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ సూచించారు. ఉత్సవ కమిటీలు, ప్రజలు పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని, మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ తీగలు, రహదారుల పరిస్థితులను ముందుగానే పరిశీలించాలని సూచించారు. డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం, గొడవలు, అసభ్య ప్రవర్తనకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ నరసింహులు కోరారు. నిమజ్జనం సందర్భంగా బందోబస్తు, బ్యారికేడ్లు, వెలుతురు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, అన్ని వర్గాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షబ్బీర్, బీజేపీ నాయకులు సుమన్, పుష్పలత నాయక్, రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కానిస్టేబుల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్జీయూకేటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

ఇడుపులపాయ, (మనస్సాక్షి): ఆర్జీయూకేటీ ఆర్.కె.వ్యాలీ ప్రాంగణంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్--2026 పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ విభాగాల్లో రూపొందించిన నూతన అనువర్తనాలు, వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో మొత్తం 119 బృందాలు పాల్గొనగా, వాటిలో 50 ఉత్తమ బృందాలను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రాంగణ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. జి. విజయప్రకాష్, విద్యా విభాగం డీన్ డా. రమేష్ కైలాష్, పరిపాలన అధికారి డా. పి. రవికుమార్,



సమన్వయకర్త ఉదయశ్రీతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆవిష్కరణ, విశ్లేషణాత్మక ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని, భవిష్యత్తులో ఆర్జీయూకేటీ ప్రతిష్ఠను మరింత పెంచేలా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

# వేంపల్లిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



వేంపల్లె, (మనస్సాక్షి): వేంపల్లె పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న శ్రీ వృషభాచలేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరుమల వేణు నేతృత్వంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని శ్రీకృష్ణుడిగా ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ పి.వి. రమణ పర్యవేక్షణలో సాయంత్రం ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉట్టి ఏర్పాటు చేసి చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేయగా భక్తులను ఆకట్టుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు సునీల్, రామాంజనేయులు, వరాలు, జ్యోతి, రాజమ్మ, మారుతి ప్రసన్న, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగతో అభివృద్ధికి మరో అడుగు




వేముల, (మనస్సాక్షి): వేముల గ్రామ పంచాయతీలో పల్లె పండుగ--3.0లో భాగంగా పశువుల షెడ్డు నిర్మాణానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల టీడీపీ నాయకుడు పేర్ల శేషారెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు రైతులు, పశు పోషకులకు అవసరమైన సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ తెలిపారు. పల్లె పండుగ--3.0 ద్వారా ప్రజలకు నేరుగా ఉపయోగపడే అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారి, బేర్‌ఫుట్ టెక్నీషియన్, ఫీల్డ్ అసిస్టెంట్, పశువుల షెడ్డు రైతు, కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ.. నిందితుడి అరెస్ట్



చెన్నూరు, (మనస్సాక్షి): ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన సమయంలో తాళాలు, బీరువా పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన కేసులో చెన్నూరు పోలీసులు నిందితుడు కొప్పెర్ల ప్రసన్న కుమార్ (26)ను శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి సుమారు 22 గ్రాముల బంగారు ఆభరణాలు, 79 గ్రాముల వెండి ఆభరణాలు కలిపి మొత్తం 101 గ్రాముల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చెన్నూరు మండలం కొండపేటకు చెందిన నంద్యాల నరేంద్ర జూలై 25న ఇంటికి తాళం వేసి పెండ్లిమర్రికి వెళ్లగా, జూలై 28న తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం, బీరువా పగలగొట్టి ఉండటంతో పాటు బంగారు కమ్మలు, ముక్కుపుడక, ఉంగరాలు, వెండి పట్టీలు, వెండి మొలతాడు తదితర ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచనల మేరకు, కడప డీఎస్పీ బాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో కడప సీసీఎస్ పోలీసుల సహకారంతో చెన్నూరు సీఐ షైక్ చాంద్ బాషా, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తమ సిబ్బందితో దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని కడపలోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు కడప కేంద్ర కారాగారానికి తరలించారు.



# డ్రై డే పాటించడంపై అవగాహన



తొండూరు, (మనస్సాక్షి): మండలంలోని సంతకొవ్వూరు గ్రామంలో శుక్రవారం డ్రై డే సందర్భంగా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా జ్వర, లార్వా సర్వే నిర్వహించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను అరికట్టేందుకు ప్రతి వారం ఒకరోజు డ్రై డేగా పాటించాలని సిద్దయ్య సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, నీటి ట్యాంకులు, సంపులను మూసి ఉంచాలని, కూలర్లు, రిఫ్రిజిరేటర్ల వెనుక నీటి ట్రేలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని తెలిపారు. వారానికి ఒకసారి నీరు నిల్వ ఉ ఒడే ప్రాంతాలను పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. ముఖ్యంగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి కుటుంబాన్ని, సమాజాన్ని దోమల వ్యాధుల నుంచి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ రాధారుక్మిణి, ఆశా కార్యకర్త శారద, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284